# అస్థిపంజరాలు

మిట్నాల వీరరాఘవశర్మ

ఆమె చచ్చిపోయింది. చచ్చిపోకముందు అందరూ విసుక్కున్నారు—ఇంకా చచ్చిపోలేదే అని. ఎముకలు బయటపడ్డ మనిషిని ముట్టుకోవాలంటే అందరికీ అసహ్యమే ఆ యింట్లోఆమె తిండికి మొగంవాచి చచ్చింది. ఇప్పుడు అందరూ తలా ఒకరకంగా వర్ణిస్తూ ఏడుస్తున్నారు భర్త ఏడ్వలేదు.

అతడేమాత్రం ఏడ్వలేదు నెలరోజులుగా భార్యతిండిలేక మంచమెక్కడం, మందుమాకులు కొని యిచ్చేందుకుకూడా తనదగ్గర దమ్మిడీలేకపోవడం, ఆమెకు ఏకోశానా బ్రతికే ఆశలు లేకపోవడం చూసిఎప్పుడోచచ్చినట్టుగానే లెక్క. ఈనాడు నిజంగా చచ్చింది. అందరూ నానా రకాలుగా ఏడుస్తూనే శవాన్ని వల్లకాటికి పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరు రాగంతోనే వెదురు బొంగులకు, మరొకరు కాంభోజీరాగంలో పురిత్రాళ్ళకు, యింకొకరు క్రొత్తచీరకు సలహాలిస్తున్నారు. కాని అతడేడ్వలేదు. అసలు లోకాన్నే మర్చిపోయాడు-లోకానికీ అతనికీ ఆదీభేదం చీకటి పడ్తోంది శవాన్ని కాటికిచేర్చాలనే మాటలు అతణ్ణి ఈ లోకానికి తెచ్చాయి. అప్పుడేడ్చాడు. ఇంతవరకూ కుదురుగా నిలవున్న దుఃఖప్రవాహం కట్టలు త్రెంచుకుంది-

బ్రతికున్నప్పుడు—ప్రాణాలతో అటమటించేటప్పుడు అన్నం, కొత్తచీర, వేడినీళ్ళస్నానం అబ్బలేదు. అస్థిపంజరానికి ఈమర్యాదలు జరగటంతో అతడి కడుపులో చేయిపెట్టి పిసికినట్లయింది. అతడికి ఈమెకుగల సంబంధాన్ని అనేకవిధాలనిర్వచించారు ప్రఫుల్లంగా వెలిగే ఆమె పై వర్ణ్యాన్నిచూసి అతడు నీతిప్రబోధంగా స్వీకరిస్తున్నాడు.

తనకోసం ఎన్నో త్యాగాలుచేసింది. తాను కూలికివెళ్తానని తన కడుపునిండా తిన్నతర్వాతగాని ఆమె ఎంగిలిచేసేదికాదు పైటాల (మధ్యాహ్నం) సద్దికూడు మిల్లుకుతెచ్చి తినమని తాను బ్రతిమాల్తే రెండుముద్దలు తానుచేతులార నోట్లో పెడ్తే అప్యాయంగా తినేది. తనకోసం కడుపు కాల్చుకుంది తనకోసం చచ్చింది. మందుతీసుకో మిల్లుయజమాని నడిగి యాభై రూపాయలు తెస్తానంటే బాకీచేసి ఆ రంగునీళ్ళుత్రాగను, నాఖర్మ ఏలావుంటే అలాజరుగుతుంది, అని బుజ్జగించింది నిజంగా అతడిభార్య అతనికోసమేచచ్చింది. అతడికి నిర్గుండెపండింది, అందుకే ఇంతవరకూ అతడేడ్వలేదు.

నలుగురూ కాటివరకూ వచ్చినారు. అతడికి ఆమెతో అనుబంధముంది. ఆ తావత్రయం అతడికితెలుసు, అందరూవెళ్ళిపోక ఎంతసేపని ఉంటారు? అతడి హృదయశిలపైన ఆమె బంగారుపూత పూసి వెళ్ళింది. ఆమె నిజంగా స్వర్ణరేఖ, దాని తత్త్వం అతడికే తెలుసు, తెలియని సంఘం వెళ్ళిపోయింది.

స్మశానవాటికలో గాఢాంధకారం. అతడింకా తనభార్య గోరీప్రక్కనే వున్నాడు. జీవితంలో అతడూ, ఆమె ఒకేదారంలో అతుక్కున్నారు. పురిబలంగా వున్నన్నాళ్లు త్రాడు వారిద్దరిని ఏకతావులో వుంచింది. బంధం తెగింది. మళ్ళీ అతకదని తెలుసు, అయినా పూర్వపు స్మృతి

మరువలేయదు. ఆమె చచ్చినా యింకా తన భార్యే, తాను భర్తే.

అతని తల తిరిగింది ముచ్చెమటలు పోశాయి అల్లంతదూరాన చప్పుడు అయింది. అతని భార్య కదల్తోంది. ఆమె మునుపటి ఆమెగా లేదు. రూపం మారింది, కండరాలు లేవు ఆయినా ఆమె తనభార్య. కాని భయం అతడికి,

ఆ సమాధికిందనే ఉన్న మరో ఎముకల పంజరం త్రోసుకొని పైకివచ్చి అతనిభార్యతో కొట్లాడుతూంది, ఇన్నాళ్లు తన భార్య కఠినంగా మాట్లాళ్ళేదు అత డారాటపడుతున్నారు

'నెలక్రిందటనే నన్నిక్కడ పూడ్చినారు-అంతలోనే మళ్లీ నీవు నాపై పడ్డే ఏలాగు? చచ్చినా వదలిపెట్టరేం' అంది ఒకపంజరం

"ఆ లోకంలో బరువయ్యే యిక్కడికి వచ్చినాము. నీలోనూ సామరస్యం లేదా!" తన భార్య—కాదు— పంజరంలో వుండే భార్య అంటోంది,

"నీకూ ఆ గతే పట్టిందా అమ్మా - క్షమించు నీవు ఏ ధనలక్ష్మివో అని గదురుకున్నా, మనలో మనం ఒద్దికగా మెలగాలి. మనరాజ్యంలో అంతా భగ్నజీవులే ఒకరిదుఃఖాల ఒకళ్ళం విచారించుకుంటూ చీకుచింతాలేకుండా కాల గడుపుకుందాం"—అని మొదటిపంజరం తనభార్యను కౌగలించుకుంటోంది

"నీ మరణమింత త్వరగా జరగడానికి కారణమేమిటి చెలీ" అంటూ తనభార్య అడిగినమీదట, ఆ మొదటిపంజరం అంటోంది—

"నేనూ ఒక శ్రామికుని భార్యను దినమూ మిల్లుకు పనికెళ్ళేదాన్ని ఆ రోజు శనివారం. అందరూ వెళ్లిపోయారు యజమానికొడుకు నా మీద కన్నువేశాడు. దాంతో నాకు అధికంగా డబ్బు కూలీ క్రింద ఇచ్చేవాడు ఓ రోజు నా భర్త నన్ను చావతన్నినాడు యజమానికుమారుడు ఆ రోజు బలాత్కారం చేయబోగా! అక్కడున్న దుడ్డుకఱ్ఱతో నాకే తెలియకుండా కొట్టాను దాంతో అతడు చచ్చాడు. నాకు మరణశిక్ష. నా భర్త పిచ్చెత్తి యిక్కడ తిరుగుతున్నాడు, నలుగురూ నా గోరీమీద "కులట' అని వ్రాశారు ఆ లోకంలో కులటగానే చలామణీ అవుతున్నాను. ఈ లోకంలో నా కెంతో గౌరవముంది ఆ చివర యజమాని కొడుకు శవము పూడ్చబడింది. అతడి గోరీపైన-చలువరాతిబండలపైన-నల్లటి అక్షరాలతో-'దానకర్ణుడు ఆర్తత్రాణపరాయణుడు' అని నానారకాలుగా వ్రాశారు ఆ లోకంలో అతడి పుష్పపులుసు తిన్నవాళ్ళు చెడపొగడుతున్నారు. ఈ లోకంలో మనవాళ్లు అతడిని మనదగ్గరకు రానీయరు, మనమంటే అతడికి భయం—' అని మొదటి అస్థిపంజరం తన విషాదగాథ చెప్తూంటే, "మనుష్యుల అకిలిడి వినపడుతూంది, పద చెల్లీ లోపలికి" అని రెండుపంజరాలు ఒకే గోరీలోనికి ఎంతో ఒద్దికగా వెళ్ళిపోవడంతో— అతడు తనకూ ఆమెకూ గల సంబంధం ఈ లోకంలోనే తెగిపోయిందని, ఆ లోకంలో తన భార్య సుఖంగా ఆ లోకంవాళ్ళతో మెలగుతూందని, ఆమెకోసం దుఃఖించడం లాభం లేదని- అక్కడే మొదటిపంజరపు స్త్రీయొక్క భర్త ఉన్మాదంగా తిరుగుతూంటే అతడి దగ్గరికెళ్ళి "పిచ్చివాడా మన లోకానికి మెష్టం వెళ్దాం, రావోయ్" అన్నాడు!